సాక్షి
ఒడిశా

సోమవారం। 15। సెప్టెంబర్। 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 7,01,680
బంగారం: 5 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
వెండి: 60 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



ఘనంగా హిందీ దినోత్సవం
హిందీ దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - 8లో



దోచుకుంటున్న దళారీలు
ఆయుష్మాన్‌కార్డులను దళారీలు దోచుకుంటున్నారు. పేదలు బాధ పడుతున్నారు. - 8లో

రాజధానిలో ఏఐ కెమెరాల.. ఏర్పాటుకు సన్నాహాలు

- 645 ప్రదేశాల్లో 3,100 కెమెరాలు ఏర్పాటు



భువనేశ్వర్: రాజధానిని నేర రహితంగా మార్చడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ దిశలో ప్రభుత్వం మానవ వనరులకు బదులుగా ఏఐ (యాంటీ ఫిక్షన్ ఇంటెలిజెన్స్)ను మోహరించాలని నిర్ణయించింది. ఏఐతో మొత్తం రాజధానిని నియంత్రించడానికి భారీ ప్రణాళిక సిద్ధం చేసింది. నగరంలోని ప్రధాన వీధుల్లో 3,100 ఏఐ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

శక్తివంతమైన వ్యవస్థ

ఈ కెమెరాలు చాలా శక్తివంతమైనవి. అవి స్త్రీ, పురుషుల గుర్తింపు, రంగు తదితర అంశాల్ని ఇట్టే పసిగడతాయి. ఇవి నేరస్తులను, సంబంధిత వాహనాలను సులభంగా పట్టుకోగలవు. నేరస్తుడి గురించి నామ మాత్రపు సమాచారం అందజేస్తే పూర్తి వివరాలను తెలియజేస్తుంది. ఈ ఏఐ కెమెరాలను అన్ని పోలీస్ ఠాణాలకు అనుసంధానించవచ్చు. నేరం చేసి ఎవరూ తప్పించుకోలేరు. నేరస్తుడు లేదా నేరంలో పాల్గొన్న వాహనం నగరంలో ఎక్కడ తిరుగుతుందో ఇట్టే తెలుసుకుని సంబంధిత ఠాణా పోలీసులకు సమాచారం ప్రసారం చేస్తుంది. ఫలితంగా, నేరస్తుడిని పట్టుకోవడం సులభం అవుతుంది. గతంలో ప్రతి 1,000 మంది జనాభాకు 75 సాధారణ కెమెరాలను ఏర్పాటు చేశారు. కానీ ఒక్కో ఏఐ కెమెరా 2,000 మందిని పర్యవేక్షించగలవు. రాష్ట్ర ప్రభుత్వం తుది ఆమోదంతో టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. అధికారులు వివిధ విదేశీ నగరాలను సందర్శించి అక్కడి ట్రాఫిక్, నేర నియంత్రణ వ్యవస్థలను పరిశీలించిన నివేదికల ఆధారంగా అటువంటి ఆధునిక సాంకేతికతని ప్రారంభించాలని నిర్ణయించారు. మొదటి దశలో రాజధానిలో నేరాలు, ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థలో అమలు చేయాలని ప్రభుత్వం ప్రవేశ పెడుతుంది. ఇది ప్రభావవంతంగా ఉంటే అంచెలంచెలుగా ఈ వ్యవస్థను క్రమంగా ఇతర నగరాల్లో కూడా ప్రవేశపెడతారు.

భువనేశ్వర్ స్మార్ట్ సిటీ లిమిటెడ్ సీనియర్ అధికారి ఒకరు మాట్లాడుతూ, వివరణాత్మక సమీక్ష మరియు అధ్యయనం తర్వాత, 645 ప్రదేశాలలో 3100 ఏఐ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మొదటి దశలో 1500 ఏఐ కెమెరాలను నగరంలో ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు ప్రీ-బిడ్డింగ్ సమావేశం ఇటీవల ముగిసింది. 14 కంపెనీలు పాల్గొని టెండర్ తీసుకోవడానికి ఆసక్తి చూపాయి.

ఒడిశాలో మొదటిసారిగా ఒపెక్స్ మోడల్ కింద టెండర్ ప్రక్రియ జరుగుతోంది. గతంలో, ప్రభుత్వం మొత్తం డబ్బు ఖర్చు చేసేది. తదనంతర కార్యాచరణలో లోపాలు తలెత్తిన అనుబంధ సంస్థలు ఎగవేయడం వంటి సంఘటనలు చోటుచేసుకునేవి. సీసీటీవీ కెమెరాలు లేదా ఇతర మౌలిక సదుపాయాల నిర్వహణ వ్యవహారంలో ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్ని చవి చూసిన ప్రభుత్వం ఒపెక్స్ మోడల్ టెండర్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇది పూర్తిగా పనితీరు ఆధారిత టెండర్. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి ముందస్తు ఖర్చు చేయదు. టెండర్ గెలిచిన సంస్థ అన్ని ఖర్చులను భరిస్తుంది. ఏఐ కెమెరాను కొనుగోలు చేయడం నుండి దానిని ఇన్‌స్టాల్ చేయడం మరియు అమలులోకి తీసుకురావడం వరకు సంస్థలు తన స్వంత ఖర్చుతో అన్ని పనులను చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ డబ్బును సంస్థకు విడతలవారీగా చెల్లిస్తుంది. పనితీరుని చవి చూసిన తర్వాత కెమెరా వ్యవస్థ సరిగ్గా పని చేస్తే ఆ సంస్థ వాయిదాల డబ్బును పొందుతుంది. లేకుంటే చేజార్చుకోవడం తథ్యం. ఖరారైన సంస్థకు ఏడేళ్లలో 84 వాయిదాల్లో మొత్తం చెల్లించే నిబంధనతో టెండర్ నిర్దేశాలు జారీ చేశారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ముఖ్యమంత్రి సలహాదారు ప్రకాష్ మిశ్రా అధ్యక్షతన ఇటీవల దీనిపై ఉన్నత స్థాయి సమావేశం జరిగిందని ఆ సీనియర్ అధికారి తెలిపారు. దీనిలో భువనేశ్వర్ పోలీస్ కమిషనర్, భువనేశ్వర్ స్మార్ట్ సిటీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, వివిధ విభాగాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఏఐ కెమెరాల మౌలిక సదుపాయాల గురించి వివరంగా చర్చించారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు అంకుర పూజలు



పెద్దబ్రాహ్మణ వీధి జంక్షన్ వద్ద ఉత్సవ ఏర్పాట్లు

- 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఏర్పాట్లలో కమిటీ సభ్యులు నిమగ్నం



ఎస్‌కేసీజీ కళాశాల జంక్షన్ వద్ద ఉత్సవాలకు అంకుర పూజలు చేస్తున్న మోటార్ కార్మికులు



శుభ రాట ఏర్పాటు చేస్తున్న భక్తులు

పర్లాకిమిడి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పర్లాకిమిడి పట్టణంలో పలు కూడళ్లలో పందిళ్లు, పెండాళ్లు, దుర్గాదేవి విగ్రహాల తయారీతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థానిక ఎస్‌కేసీజీ కళాశాల జంక్షన్ వద్ద జిల్లా ప్రైవేటు డ్రైవర్స్ సంఘం, మోటారు వర్కర్స్ కలిసి దేవీ శరన్నవరాత్రి పూజలకు అంకుర పూజలు ఆదివారం ప్రారంభించారు. ఈనెల 22న అష్టమి నాడు కళాశాల జంక్షన్ వద్ద దుర్గాదేవి ప్రతిష్ఠించి పూజలు జరుపుతారు. అలాగే పెద్ద బ్రాహ్మణ వీధి వద్ద దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 21న మహాలయ అమావాస్య నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమౌతాయని నిర్వాహకులు తెలిపారు. పెద్దబ్రాహ్మణ వీధిలో గత 60 ఏళ్లుగా పెద్ద ఎత్తున దుర్గాశరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ధోబా చాకలి వీధి వద్ద కూడా పెద్ద ఎత్తున దుర్గా పెండాళ్లు నిర్మిస్తున్నారు.

త్వరలో పూరీ శ్రీమందిర్‌లో ధాడి దర్శనం: మంత్రి

భువనేశ్వర్: పూరీ శ్రీమందిర్‌లో త్వరలో వరుస క్రమంలో (ధాడి) దర్శనం ప్రారంభం కానుంది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హుండీ (విరాళాల పెట్టె) తరలించిన తర్వాత వరుస దర్శనం అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ ఆదివారం తెలిపారు. రానున్న ఏడు రోజుల్లో పూరీ శ్రీమందిర్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వరుస ఆధారిత దర్శన వ్యవస్థ (ధాడి దర్శనం) ప్రవేశపెడతామని మంత్రి వివరించారు. అంగుల్ పర్యటన సందర్భంగా మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ మీడియాతో ఈ విషయం తెలిపారు. సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అన్ని అనుమతులు పొందిన తర్వాత హుండీని తరలించే ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. హుండీ పూర్తిగా తరలించిన 7 రోజుల్లో ధాడి దర్శన్ వ్యవస్థను అమలు చేస్తారని ఆయన చెప్పారు. కొత్త వ్యవస్థ క్రమబద్ధమైన, సురక్షితమైన దర్శన అనుభవాన్ని నిర్ధారిస్తుందని మంత్రి భక్తులకు హామీ ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో భద్రతకు ఏమాత్రం భంగం కలగకుండా భక్తుల సజావుగా రాకపోకలను సులభతరం చేసి వరుస క్రమంలో సంతృప్తికరమైన దర్శనం కల్పించడం ఈ ఏర్పాటు లక్ష్యంగా మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు. ధాడి దర్శన వ్యవస్థ భక్తులు వ్యవస్థీకృత పద్ధతిలో వరుసలో నిలబడటానికి వీలు కల్పిస్తుంది. రద్దీని తగ్గిస్తుంది మరియు ప్రధాన దేవతలను సజావుగా చేరుకుని కనులారా దర్శించుకునే అవకాశం కల్పిస్తుంది.

న్యూఢిల్లీలో కొరాపుట్ కాఫీ ఘుమఘుమలు



న్యూఢిల్లీలో ఒడిశా వాసులతో మంత్రి నిత్యానంద గొండో



ఒడిశా నివాస్‌లో కొరాపుట్ కాఫీని తాగుతున్న మంత్రి నిత్యానంద గొండో

కొరాపుట్: ప్రఖ్యాత కొరాపుట్ కాఫీ గుమగుమలు న్యూఢిల్లీకి వ్యాపించాయి. న్యూఢిల్లీలో ఒడిశా నివాస్‌లో కొరాపుట్ కాఫీ షాపును ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ, ప్రాథమిక విద్య, మైనారిటీ సెల్ క్యాబినెట్ మంత్రి నిత్యానంద్ గోండో ఈ షాప్‌ను ఆదివారం సందర్శించారు. అక్కడ ఒడిశా వాసులతో కలిసి కాఫీని తాగారు. కొరాపుట్ కాఫీ అంతర్జాతీయ స్థాయిలో విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

రెండు కార్లు ఢీ : ఆరుగురికి గాయాలు





నుజ్జయిన కార్లు

మల్కన్‌గిరి: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకున్న ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా మాత్తిలి పోలీసుస్టేషన్ పరిధి శిరాగూడ గ్రామం వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మల్కన్‌గిరి నుంచి వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న మరో కారును బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. అదుపుతప్పిన రెండు రోడ్డు పక్క పొలాల్లో పడిపోయాయి. కార్లలో ఉన్న ఆరుగురు గాయపడగా.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తక్షణమే స్పందించి క్షతగాత్రులను మాత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మల్కన్‌గిరి జిల్లా ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. గాయపడిన వారిలో ఒకరు హ్యుందాయ్ కారు షోరూమ్ జనరల్ మేనేజర్ ఉన్నట్టు తెలిసింది. మాత్తిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజామరుగుదొడ్లను.. తెరిపించాలి

- పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహికి ప్రజల విజ్ఞప్తి



పురపాలక సంఘం చైర్మన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిర్మలా శెఠి



సౌచాలయాన్ని తెరిపించాలని ఎమ్మెల్యేను కోరుతున్న గజపతి మోటారు వర్కర్స్ సంఘం నాయకులు నర్సింగ మాలబిశోయి



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

పర్లాకిమిడి: కొత్త బస్టాండ్‌లో నెల రోజులుగా మూతబడి ఉన్న ప్రజా మరుగుదొడ్లను (సౌచాలయం తెరిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు. మరుగుదొడ్లను మూసి వేయడంతో ప్రయాణికులు అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ఆదివారం ఉదయం మూతబడిన మరుగుదొడ్లను సందర్శించారు. గతంలో బీహారీ వాళ్లకు కాంట్రాక్టు పద్ధతిన పురపాలక సంఘం సౌచాలయ నిర్వహణ బాధ్యతలను అప్పజెప్పారు. అయితే ఇటీవల స్నానపు గది శ్లాబు విరిగిపోయిపోవడంతో నెలరోజులుగా మూసివేశారు. దీంతో స్టేషన్‌కు వచ్చి పోయే ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో ఉన్న రెండు ప్రజామరుగుదొడ్లు మూతబడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిసి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విచ్చేసి పర్లాకిమిడి మున్సిపల్ చైర్మన్ నిర్మలా శెఠి, ఈఓ లక్ష్మణ ముర్మును పిలిపించి వివరణ అడిగారు. బస్టాండ్‌లో ఉన్న మరో సౌచాలయం కూడా మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారని బస్సు వర్కర్స్ సంఘం జిల్లా కోఆర్డినేటర్ నర్సింగ మాల బిశోయి, ప్రైవేటు బస్సు యాజమాన్యం సంఘం కార్యవర్గ సభ్యులు కిలారి గోపి ఎమ్మెల్యే రూపేష్‌కి వివరించారు. 15 రోజుల్లో మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి ప్రయాణికులకు అందుబాటులో తెస్తామని పురపాలక సంఘం చైర్మన్ నిర్మలా శెఠి హామీ ఇచ్చారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదాతలను ప్రశంసాపత్రాలతో సన్మానించిన నిర్వాహకులు



రక్తదానం చేస్తున్న దాతలు



రక్తదాన శిబిర నిర్వాహక కేశవ సేవా ట్రస్టు సభ్యులు

జయపురం: రక్తదానం అన్ని దానాల కన్నా మహత్తరమైనదని స్వయం సేవక సంఘ్ పశ్చిమ ప్రాంత ప్రముఖులు సుశీల్ జైన్ అన్నారు. ఆదివారం జయపురం అరవింద నగర్ సరస్వతీ శిశు విద్యాలయ దివ్య మందిర ప్రాంగణంలో కేశవ సేవా ట్రస్టు వారు స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సునీల్ జైన్ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదానం ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో రక్తహీన రోగులు, క్షతగాత్రులు, గర్భిణులకు రక్తం అవసరం ఉంటుందన్నారు. ఎటువంటి సమయంలో రక్త లేమితో ఏ ఒక్కరూ మరణించ కూడదని అటువంటివారు రక్షించాలంటే రక్తం ఎంతో అవసరమన్నారు. అందుచేత ప్రజలు, ముఖ్యంగా యువతీ, యువకులు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదాన శిబిర నిర్వహణకు సరస్వతీ శిశు విద్యా మందిర పూర్వ విద్యార్థి సంఘం సహకరించింది. కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయక్ వైద్య కళాశాల హాస్పిటల్ రక్తనిధి టెక్నిషియన్‌లు దాతల నుంచి రక్తం సేకరించారు. ఈ శిబిరంలో 48 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జయపురం నగర ఆర్.ఎస్.ఎస్ పరిచాలకులు డాక్టర్ నిరంజన్ మిశ్ర, సరస్వతీ శిశు విద్యాలయ పరిచాలన కమిటీ ప్రేమానంద నాయక్, రక్తదాతల మోటివేటెడ్ ధమంజొడి అధికారి డాక్టర్ నరేష్ చంద్ర సాహు, డాక్టర్ రమణీ రంజన్ దాస్‌లు అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరస్వతీ శిశు విద్యా మందిర్ ప్రధాన ఆచార్య డాక్టర్ రమణిని సన్మానించారు. శిబిర నిర్వహణలో విద్యామందిర్ పూర్వ విద్యార్థులు ప్రభాకర రౌత్, ప్రదీప్ త్రిపాఠీ, రక్తదాతల మోటివేటర్లు మిహిర్ మిశ్ర, సత్యవాది మిశ్రలు రక్తదాన శిబిర నిర్వహణలో సహకరించారు. ఈ శిబిరంలో రక్తదాతలకు ప్రశంసాపత్రాలతో సన్మానించారు.

న్యూస్‌రీల్

ముగిసిన వినాయక ఉత్సవాలు



నిమజ్జనానికి తరలివెళ్తున్న డెప్పిగూడ వినాయకుడు

జయపురం: జయపురంలో ఇప్పటి వరకూ వినాయక చవితి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక ఆర్అండ్‌బీ కాలనీ, నెహ్రూ నగర్ డెప్పిగూడ, భూపతి వీధి కూడలి వద్ద మోడరన్ గ్రూపు వినాయక ఉత్సవాలు ముగింపు సందర్భంగా భారీ ర్యాలీ జరిగింది. వినాయక విగ్రహాలను వాహనాల్లో తరలించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

నాల్కో సందర్శన



నాల్కో పరిశీలిస్తున్న జగదీష్ అరోరా తదితరులు

కొరాపుట్: భారత అల్యూమినియం కేంద్రం (నాల్కో) ని ఉన్నతాధికారులు సందర్శించారు. కొరాపుట్ జిల్లా దమన్‌జోడిలోని నాల్కో డైరెక్టర్ జగదీష్ అరోరా రిఫార్మర్ కాంప్లెక్స్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో అభివృద్ధి పనులు సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ బృందంలో నాల్కో ఉన్నతాధికారులు మాచిరెడ్డి కృష్ణరెడ్డి, సతీష్ చంద్ర దుబే తదితరులు ఉన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



నబరంగ్‌పూర్‌లో ప్రసంగిస్తున్న డాక్టర్ సంజుక్త పండా

కొరాపుట్: ప్రథమ చికిత్సపై విద్యార్థినులకు అవగాహన ఉండాలని అధ్యాపకురాలు డాక్టర్ సంజుక్త పండా పేర్కొన్నారు. ఆదివారం నబరంగపూర్ జిల్లా కేంద్రంలోని మహిళా మహా విద్యాలయంలో జరిగిన ఫస్ట్ ఎయిడ్ అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. పాము కాటు, పక్షవాతం, కాలిన గాయాలు, అపస్మారక స్థితి వంటి ప్రమాదాలు జరుగుతుంటాయని, అలాంటి సందర్భంలో ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాలు దక్కుతాయని అన్నారు. కార్యక్రమంలో యూత్ రెడ్‌క్రాస్ అధికారి డాక్టర్ అయుత పండా, తర్నమ్ ఆరా, సునీత పాత్రో, లక్ష్మీకాంత్ సౌర తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రయాణికుల బస్సు బోల్తా



బోల్తా పడిన బస్సు

భువనేశ్వర్: నయాగడ్ జిల్లా దస్‌పల్లా ప్రాంతంలో ఆదివారం ప్రయాణికుల బస్సు ప్రమాదానికి గురైంది. కటక్ నుంచి బొలంగీర్‌కు ప్రయాణిస్తుండగా జముసాహి సమీపంలో బస్సు ట్రక్కును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు.

టైరు పగిలి పది మందికి గాయాలు



టైరు పగిలి చెట్టును ఢీకొన్న వాహనం

భువనేశ్వర్: వ్యాన్ టైరు పగిలి దుర్ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 10 మంది గాయపడ్డారు. కటక్ నుంచి సంబలపూర్ వెళ్తుండగా అఠొగాడా సమీపం కొఖాడి రోడ్డుపై ఈ ప్రమాదం జరిగింది. వ్యాన్‌లో ఉన్న వాయిద్యకారులు గాయపడినట్లు సమాచారం.

యూరియా స్టాకు పరిశీలన

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితిలో బాగుసల, పాటికోట, జాజిపూర్ సహకార సంఘాలను పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ఆదివారం సందర్శించారు. గోదాముల్లో ఉన్న యూరియా స్టాకును అడిగి తెలుసుకున్నారు. యూరియా స్టాకును పరీక్షించిన ఎమ్మెల్యే రూపేష్ కొంత యూరియా పక్క రాష్ట్రానికి తరలి వెళ్తున్నట్లు గుర్తించారు. పాటికోట, బాగుసల గ్రామాల్లో యూరియ స్టాకును పరిశీలించి అధికారులతో సమీక్షించారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విలేకరులకు తెలియజేశారు.

క్లుప్తంగా

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం



మురళీకృష్ణ కుటుంబానికి చెక్ అందజేస్తున్న పోలీసులు

మందస: ఎచ్చెర్లలోని జిల్లా సాయుధ పోలీసు దళంలో విధులు నిర్వహించిన ఏఆర్ కానిస్టేబుల్ బెహరా మురళీకృష్ణ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఈ నెల 8న మృతి చెందారు. మందస కిల్లమ్మ వీధిలో నివాసం ఉంటున్న ఆయన భార్య మమతారాణికి ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి లక్ష రూపాయల చెక్కును ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రోణంకి కృష్ణంనాయుడు, ట్రెజరర్ కె.భుజంగరావు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



సమావేశంలో మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అంగన్‌వాడీల పోరాట ఫలితంగానే మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మారుస్తూ ప్రభుత్వం జీఓ ఇచ్చిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్–హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మినీ అంగన్‌వాడీల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం (ఐసీడీఎస్) పరిరక్షణకు అంగన్‌వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సుధ, కె.కళ్యాణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సభలో యూనియన్ నాయకులు హైమావతి, శాంతామణి, కె.వి.హేమలత, కె.సుజాత, జె.కాంచన, భూలక్ష్మి, చంద్రమౌళి, మాధవి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, సెలవులు మంజూరు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళం యూటీఎఫ్ కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ 6వ మహాసభలు నిర్వహించారు. ముందుగా సీఐటీయూ జెండాను సీనియర్ ఆశా వర్కర్ జి.పార్వతి ఆవిష్కరించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అమరావతి నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లా అధ్యక్షురాలు డి.ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ యాప్‌ల భారం తగ్గించాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆశాల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి వేతనాలు పెంపుదల చేయాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలిగా కె.నాగమణి, అధ్యక్షురాలిగా డి.ధనలక్ష్మి, ఉపాధ్యక్షులుగా డి.దమయంతి, పి.జయలక్ష్మి, జి.పార్వతి, ప్రధాన కార్యదర్శిగా జి.అమరావతి, సహాయ కార్యదర్శులుగా పి.ప్రేమలత, స్వర్ణలతా పట్నాయక్, ఎం.లావణ్య, కోశాధికారిగా వై.సుజాతతో పాటు 35 కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎస్.వి.రమణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ద్రాక్ష



పొందూరు: లోలుగు కేజీబీవీ విద్యార్థిని ఎం.ద్రాక్ష జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్–18 విభాగంలో జిల్లా స్థాయిలో షాట్‌పుట్‌లో మొదటి స్థానం, డిస్కస్ త్రోలో రెండో స్థానంలో నిలిచింది. ఈ నెల 27 నుంచి 29 వరకు ఏలూరు జిల్లా అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్.లలితకుమారి, పీఈటీ రూపవతి తెలిపారు.

ఆయుష్మాన్‌భవ కార్డుదారులను..

దోచుకుంటున్న దళారీలు

- చత్తీష్‌గఢ్‌కు రోగులు తరలింపు
- వారి కార్డుల నుంచి డబ్బులు తీసుకుంటున్న వైనం
- రంగంలోకి దిగిన పోలీసు అధికారులు
- పూర్తి స్థాయిలో విచారణ తరువాత వివరాలు వెల్లడి



రోగులను తీసుకెళ్లేందుకు దళారులు తీసుకువచ్చిన అంబులెన్స్

జయపురం: కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షల వరకు అందించే వైద్య సేవలు ఉచితంగా పొందేందుకు వృద్ధులు, ప్రజలకు ఆయుష్మాన్‌భవ కార్డులు సమకూర్చింది. ఈ కార్డుదారులపైన కొంతమంది దళారుల కన్ను పడింది. రోగులకు దగ్గరుండి వైద్యం చేయిస్తామని, అంబులెన్స్‌లు తీసుకువచ్చి పక్క రాష్ట్రానికి తీసుకువెళ్తున్నారు. అయితే వారికి ఎటువంటి వైద్యం చేయించకుండానే హాస్పిటల్ వర్గాలతో చేతులు కలిపి ఆయుస్మాన్‌భవ కార్డులలోని డబ్బులు కాజేస్తున్నారని జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కుంద్రా సమితి అసన గ్రామ పంచాయతీలో పకనగుడ గ్రామానికి ఛత్తీష్‌గఢ్ నుంచి శుక్రవారం రెండు అంబులెన్స్‌లు రోగులను తీసుకువెళ్లేందుకు వచ్చాయన్న అనుమానంతో గ్రామస్తులు వాటిని అడ్డగించి అందులో ఉన్న దళారీని పట్టుకున్నారు. ఈ విషయం కొట్‌పాడ్ ఎమ్మెల్యే ప్రతినిధి బిప్రనారాయణ ఆచార్యకు తెలియజేయగా.. ఆయన వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుంద్ర పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ సనాతన శుశాణ, కానిస్టేబుల్ రవీంద్ర పూజారీ వచ్చి ఆ రెండు అంబులెన్స్‌లను, దళారిని స్టేషన్‌కు తీసుకువెళ్లారు. గ్రామ వాసుల ఆరోపణ ప్రకారం కొద్దిరోజులుగా స్థానిక గురునాథ్ కమర సహకారంతో పూల్‌భట్ట గ్రామ పంచాయతీలో ఆయుష్మాన్‌భవ కార్డులున్న కొంత మంది వ్యక్తులను ఛత్తీష్‌గఢ్‌లోని బస్తర జిల్లా జగదల్‌పూర్‌కు తీసుకువెళ్తున్నారు. అక్కడ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స చేయించిన సంఘటనపై ప్రజలకు అనుమానం వచ్చింది. ఒడిశాలో రోగులకు వైద్య చికిత్స కొరకు పలు సౌకర్యాలు కల్పిస్తున్నా.. ఛత్తీష్‌గఢ్‌లో ఏ సౌకర్యాలు ఉన్నాయని తీసుకువెళ్తున్నారన్న అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఆ అనుమానంతోనే గ్రామస్తులు రెండు అంబులెన్స్‌లను అడ్డుకున్నట్లు చెబుతున్నారు. కొద్ది రోజుల కిందట పూల్‌భట్ట గ్రామం నుంచి ఆయుష్మాన్‌భవ కార్డులు గల దాదాపు 25 మంది రోగులను ఛత్తీష్‌గఢ్‌లో ఒక ప్రైవేట్ చికిత్స కేంద్రానికి తీసుకువెళ్లి వైద్య చికిత్సలు చేయకుండా కేవలం భోజనం పెట్టి వారి ఆయుష్మాన్‌భవ కార్డులు అడిగి తీసుకొని వారి ఫోన్లకు వచ్చే ఓటీపీ అడుగుతున్నారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. తద్వారా వారికి చికిత్సకు ఖర్చు అయినట్లు చూపించి ఆయుస్మాన్‌భవ కార్డులలో డబ్బులు తీసుకుంటున్నారన్న అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణపై పూర్తి దర్యాప్తు జరిపిన తరువాత వాస్తవాలు బయట పడతాయని పోలీసు అధికారి అశ్వినీ పట్నాయక్ వెల్లడించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో కొట్‌పాడ్ సమితి చందిలిలో గల చికిత్సాలయం పీఆర్‌ఓ కర్ణ భొత్రను పోలీసులు స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారిస్తున్నట్లు సమాచారం. అలాగే కెరమటి గ్రామం దళాల్ నినిబాబు కుమార్ కూడా ఈ ప్రాంత రోగులను రాయపూర్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్తూ ఒక్కొక్క రోగి వద్ద వెయ్యి రూపాయలు కమిషన్ తీసుకుంటున్నాడని ఆరోపణలున్నాయి. నినిబాబు రాయపూర్ తీసుకువెళ్లిన శ్రీధర పూజారి, ఖగునతి అనే వ్యక్తులకు కిడ్నీ సంబంధిత సమస్యలున్నాయని, వారికి ఆపరేషన్ చేయాలని డాక్టర్లు తెలిపారు. వారు చికిత్స చేయించుకోకుండా ఇళ్లకు తిరిగివచ్చారు. దళారులు పట్టుబడిన తరువాత అనేక విషయాలు బయటపడుతున్నాయని ప్రజలంటున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసు అధికారి అశ్వినీ పట్నాయక్ పత్రికల వారికి వెల్లడించారు.

సమాచార హక్కు దుర్వినియోగం

- ఏడాది పాటు దరఖాస్తుల దాఖలు నిషేధం



భువనేశ్వర్: ఒడిశా రాష్ట్ర సమాచార కమిషన్ ఒక వ్యక్తిని ఒక సంవత్సరం పాటు సమాచార హక్కు (ఆర్టీఐ) దరఖాస్తులు చేయకుండా నిషేధించింది. సతొపురి గ్రామానికి చెందిన చిత్తరంజన్ సెఠి అనే దరఖాస్తుదారుడు మెయితిపూర్ గ్రామ పంచాయతీ, నిమాపడా మండల కార్యాలయం నుంచి ఒకే అంశంపై సమాచారం కోరుతూ వరుసగా 61 సార్లు దరఖాస్తు చేశాడు. నెలవారీగా, సంవత్సరం వారీగా ఆదాయం, ఖర్చు మరియు అభివృద్ధి పనుల వివరాలను కోరుతూ ఈ దరఖాస్తులు దాఖలు చేసిన నేపథ్యంలో రాష్ట్ర సమాచార కమిషనర్ సుశాంత కుమార్ మహంతి ఈ నిషేధ ఆదేశాలు జారీ చేశారు.

సమాచార హక్కు చట్టపరంగా దరఖాస్తుల పట్ల అనుబంధ వర్గాలు ప్రతిస్పందించడంతో సంబంధిత దస్తావేజులు, పత్రాలను ప్రత్యక్షంగా తనిఖీ చేయడానికి అవకాశాలు కల్పించినప్పటికీ చిత్తరంజన్ సెఠి పదే పదే దరఖాస్తులు దాఖలు చేయడం కొనసాగించారని సమాచార హక్కు విచారణ పీఠం పేర్కొంది. ఈ పరిశీలన ఆధారంగా అప్పీలుదారు, ఫిర్యాదుదారు దాఖలు చేసిన 61 కేసులను ఇందు మూలంగా కొట్టివేస్తున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. పైన పేర్కొన్న వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని, దరఖాస్తుదారుడి ప్రవర్తన సమాచార హక్కు ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని కమిషన్ తేల్చింది. అతని చర్య దుర్వినియోగానికి స్పష్టమైన సూచన. భారత పౌరుడిగా, దరఖాస్తుదారుడు సమాచార హక్కు చట్టం, 2005 కింద సమాచారాన్ని పొందే హక్కు కలిగి ఉన్నా ఎవరైన దేశ చట్టాన్ని, విధానాన్ని పాటించాల్సిన బాధ్యత కలిగి ఉన్నారు. ప్రజాస్వామ్యానికి అంకితమైన ఏ సంస్థ కూడా అలాంటి పవిత్రమైన చట్టాన్ని అసమానంగా, ఇష్టానుసారం ఉపయోగించడాన్ని అంగీకరించదు. ప్రస్తుత సంఘటనలో దరఖాస్తుదారుడిపై కఠినమైన చర్యలు తీసుకోవడానికి అర్హుడు అని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

బీపీఎల్ కార్డును ఉపయోగించి దరఖాస్తుదారుడు విచక్షణారహితంగా దరఖాస్తు దాఖలు చేసినట్లు సమాచార హక్కు విచారణ బృందం ధృవీకరించింది. కలెక్టర్, పూరీ జిల్లా మేజిస్ట్రేట్ దరఖాస్తుదారుని బీపీఎల్ కార్డు వాస్తవికత, ప్రస్తుత స్థితిని ధృవీకరించి తదనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 7(9) ప్రకారం అతని నుండి పునరావృతం అయ్యే లేదా భారమైన ప్రశ్నలను తిరస్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా సంబంధిత శాఖలకు సలహా జారీ చేయాలని కమిషను పేర్కొంది.

తమిళనాడులో పర్యటిస్తున్న కొరాపుట్ జెడ్పీ బృందం



కంచి దేవాలయం వద్ద జెడ్పీ చైర్మన్ సస్మిత మెలక



తమిళనాడు అధికారులతో పర్యటిస్తున్న కొరాపుట్ జెడ్పీ బృందం

కొరాపుట్: కొరాపుట్ జిల్లా పరిషత్ బృందం తమిళనాడు రాష్ట్రంలో అధికారిక పర్యటన చేస్తుంది. ఆదివారం కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షుడు సస్మితా మెలక నేతృత్వంలో జిల్లా పరిషత్ సభ్యులు ఆ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలసి పలు సంక్షేమ పథకాలు పరిశీలించారు. చెన్నైలో పంచాయతీరాజ్ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కొరాపుట్ జిల్లాలో ఉత్పత్తులు, కొట్‌పాడ్ వస్త్రాలు ఆ ప్రభుత్వ అధికారులకు అందజేశారు. చెంగల్ పట్టు జిల్లాలో పంచాయతీ రాజ్ సహాయంతో 150 మంది మహిళలు తయారు చేస్తున్న కళాఖండాల తయారీ కేంద్రం పరిశీలించారు. కాంచీపురం జిల్లాలో మహిళలచే నిర్వహించబడుతున్న చిన్న స్థాయి పరిశ్రమలు పరిశీలించారు. అనంతరం కంచిలోని కామాక్షి దేవాలయం, పాండిచేరి రాష్ట్రం సందర్శించారు.

'అపరాజిత-2025' వెలువరించాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాహిణీపతి, తదితరులు

జయపురం: చరిత్రాత్మక జయపురం దసరా వేడుకుల సందర్భంగా దసరా సావనీర్ 'అపరాజిత-2025' వెలువరించాలని దసరా మహోత్సవ కమిటీ నిర్ణయించింది. కమిటీ అధ్యక్షుడు, జయపుం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి నివాసంలో ఆదివారం ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దసరా ఉత్సవ సావనీర్ 'అపరాజిత-2025' లో జయపురం చరిత్ర, ప్రాధాన్యత, గౌరవం, పరిశోధనలు, రచనలు పొందుపరచటం జరుగుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు. అపరాజిత -2025 సావనీర్‌కు రచయిత, పరిశోధకులు డాక్టర్ పరేష్ రథ్ ప్రధాన సంపాదకునిగా వ్యవహరిస్తారన్నారు. ఈయనతోపాటు సంపాదక కార్యవర్గంలో జయపురం సాహితీ పరిషత్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ దాస్, సభ్యులు నవకృష్ణ రథ్, జయపురం సాహితీ పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయక్, రచయిత డాక్టర్ సుధాంశు శేఖర పట్నాయక్, సాహితీవేత్త శ్రీనాథ్ మిశ్ర, కాంగ్రెస్ నేత నిహార రంజన్ బిశాయి ఉంటారని వెల్లడించారు. విజ్ఞానులు, రచయితలు, పరిశోధకులు, కవులు, చరిత్రకారులు, జయపురం, చరిత్ర, జయపురం దసరా ఉత్సవాల ప్రాధాన్యతపై వ్యాసాలు, రచనలు, పరిశోధన వివరాలు అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

ఘనంగా హిందీ దినోత్సవం



ప్రారంభ గీతాన్ని పాడుతున్న విద్యార్థినులు



పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు



ప్రసంగిస్తున్న తెలుగు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్



హిందీ దివస వేదికపై అతిథులు

జయపురం: మన రాష్ట్ర భాష హిందీ అని, ఆ భాషను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అఖిల భారతావణిని జాగృత పరచి ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఆనాడు దోహదపడిందని వక్తలు వెల్లడించారు. ఆదివారం హిందీ దివస్(హిందీ దినోత్సవం)ను జయపురం సిటీ హైస్కూల్ సభాగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ట్రాన్స్‌లేటర్ మహేంద్ర కుమార్ శామంతరాయ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా రామన్ మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు ప్రముఖ కళాకారుడు దిరెన్ మోహన్ పట్నాయక్, విశ్రాంత హిందీ ఉపాధ్యాయులు రాధామోహన్ పండా, తెలుగు సాంస్కృతి సమితి అధ్యక్షుడు బీరేష్ పట్నాయక్, సిటీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్ పట్నాయక్, తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులలో వ్యాస రచన, గేయ రచన, వక్తృత్వ పోటీలు, గీత పఠనం, పోస్టర్లు తయారు చేయటం, కథలు చెప్పే పోటీలు తదితవి నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థి ఆయుష్ పట్నాయక్ కీబోర్డుపై బ్రాండ్ మాతరమ్ సంగీతం వినిపించాడు. హిందీ పద్యాలు చదివే పోటీలలో సాయి సర్జిమ్, అభశ్రీ పట్నాయక్, దేవాంశీ పట్నాయక్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. సుధాలేఖన పోటీలలో చైత్రిక, నటరాజ్ బబ్యాంశి సాహు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. జూనియర్స్ పోస్టర్ మేకింగ్ పోటీలలో ఎ.మౌనిక, ఎ.సాయిశ్రాద ఆచారి, సభ్నమ్ ప్రవీన్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. సీనియర్ కవిత రచన పోటీలలో వై.గంగోత్రి, సి.హెచ్.సుప్రియ, స్వేతా సింగ్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. వక్తృత్వ పోటీలలో సి.హెచ్.సుప్రియ, ఎ.హరిణి, ఎల్. రాజేశ్వరరావు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. సిటీ స్కూల్ హిందీ ఉపాధ్యాయురాలు కల్పన రత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు పవిత ప్రధాన్, 2025 హెచ్.ఎస్.సి పరీక్షలలో హిందీలో 95 శాతం మార్కులు సాధించిన అమిత యాదవ్, ఆశిష్, కె.మోనికను సన్మానించారు.



హిందీ దినోత్సవంలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నార్త్‌జోన్ టోర్నీలో సిక్కోలుకు మరో విజయం



ఎం.పూర్ణచంద్ర



బి.జగదీశ్వరరావు



ఎన్.సుశాంత్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ నార్త్‌జోన్ అంతర్‌జిల్లాల క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం జట్టు మరో విజయాన్ని నమోదు చేసింది. జిల్లా జట్టు అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో సమష్టిగా రాణించడంతో శుక్రవారం నుంచి ఆదివారం వరకు తూర్పుగోదావరితో జరిగిన మల్టీడేస్ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో సాధించిన 59 పరుగుల కీలకమైన ఆధిక్యతంతో శ్రీకాకుళం జయభేరి మోగించింది. విజయనగరం జిల్లా వేదికగా ఏసీఏ నార్త్‌జోన్ అంతర్ జిల్లాల త్రీడేస్ (మల్టీడేస్) పురుషుల అండర్–23 క్రికెట్ టోర్నమెంట్ వారం రోజుల కిందట మొదలైన విషయం తెలిసిందే. రెండో మ్యాచ్‌లో తూర్పుగోదావరితో శ్రీకాకుళం తలపడింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విజయనగరం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 241 పరుగులకు ఆలౌటైంది. లెఫ్టార్మ్‌స్పిన్నర్ మొదలవలస పూర్ణచంద్ర అత్యద్భుతమైన బౌలింగ్ చేసి ఐదు వికెట్లతో ఆకట్టుకున్నాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు మూడోరోజు ఆటముగిసే సమయానికి 310 పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యంతో మ్యాచ్ ప్యాయింట్లను శ్రీకాకుళం నిలబెట్టుకుని విజయం సాధించినట్టయింది. జిల్లా జట్టులో మిడిలార్డర్ బ్యాటర్ బొద్దంకి జగదీశ్వరరావు 106 పరుగులతో అజేయ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఓపెనర్ నంబళ్ల సుశాంత్ 72 పరుగులతో రాణించాడు.

జట్టు క్రీడాకారులకు అభినందన..

నార్త్‌జోన్ అండర్–23 మల్టీడేస్ క్రికెట్ టోర్నీలో వరుసగా రెండో విజయాన్ని నమోదుచేయడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు క్రీడాకారులను అభినందించారు. స్వయంగా మైదానం వద్దకు చేరుకుని క్రీడాకారులకు మిఠాయిలు పంచిపెట్టారు. జిల్లా జట్టు సమష్టిగా రాణించడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎస్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ అమ్మద్, కోశాధికారి మదీనాశైలానీ, కౌన్సెలర్ డాక్టర్ ఎస్.రవికుమార్ హర్షం వ్యక్తంచేశారు. జిల్లా జట్టుకు సెలెక్టర్‌గా జయశంకర్, కోచ్ కమ్ మేనేజర్‌గా రవితేజ వ్యవహరిస్తున్నారు.

మహిళల క్రికెట్ అభివృద్ధికి..

శ్రీకాకుళంలో మహిళా క్రికెట్ విస్తరణ, అభివృద్ధి కోసం జిల్లా క్రికెట్ సంఘం మరో అడుగుముందుకేసింది. బాలికల క్రికెట్ సబ్‌సెంటర్‌ను శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం కోసం పాఠశాల హెచ్‌ఎంతో ఎంఓయూ కుదుర్చుకున్నారు. క్రీడామైదానంలో సగభాగాన్ని క్రికెట్ విస్తరణకు వినియోగించనున్నారు.

అరసవల్లిలో భానుసప్తమి సందడి



దర్శనాలకు బారులు తీరిన భక్తులు



సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భానుసప్తమి సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలను కిటకిటలాడాయి. ఆరోగ్య ప్రదాతకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఉదయం 5.30 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతివ్వడంతో సజావుగా దర్శనాలు చేసుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయం బయట భక్తుల కోసం ఆలయ ఈవో కె.ఎస్.వి.డి.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో టెంట్లు వేసినప్పటికీ.. భక్తుల సంఖ్య పెరిగిపోవడంతో ఏర్పాట్లు సరిపడలేదనే విమర్శలు వినిపించాయి. కేశఖండన శాలలో తలనీలాలను సమర్పించుకుని ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేసుకుని దర్శనాలకు బారులు తీరారు. ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా సూర్యనమస్కారాల పూజలను చేయించుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణ కలిగిన భక్తులకు మాత్రమే అనుమతించారు. పలువురు భక్తులు తమ పెద్దల పేరిట ఆలయ అభివృద్ధికి, అలాగే నిత్యాన్నదాన పథకానికి విరాళాలను సమర్పించారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వైఎస్సార్‌సీపీ నాయకురాలు జె.సుభద్ర కుటుంబసమేతంగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థప్రసాదాలను ఇచ్చారు. వేదాశీర్వచనాన్ని అర్చకులు అందజేసారు.

ఆదాయం రూ.6.24 లక్షలు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారికి భానుసప్తమి సందర్భంగా ఒక్కరోజులో రూ.6,24,188 వరకు ఆదాయం లభించింది. దర్శనాలకు వివిధ రకాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.3.18 లక్షలు, విరాళాల ద్వారా రూ.80,188, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.26 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈవో ప్రసాద్ వివరించారు.

స్కూల్లో గొడవ.. పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ!

- విద్యార్థి, కుటుంబ సభ్యులపై దాడి చేయించిన టీడీపీ నేత
- అధికార పార్టీ కావడంతో కేసు నమోదులో పోలీసుల తాత్సారం



గాయపడిన మహిళ, కుమారుడు

శ్రీకాకుళం రూరల్ : పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య తలెత్తిన వివాదం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. ఇరు కుటుంబాలు టీడీపీకి చెందినవి కావడంతో రాజీ చేసేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. చాపురం పంచాయతీకి చెందిన ఓ టీడీపీ సీనియర్ నాయకుడు.. రాగోలులో నివాసముంటున్న ఆమదాలవలసకు చెందిన మరో టీడీపీ నాయకురాలి పిల్లలు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ఓ విషయమై ఇద్దరు పిల్లలు పాఠశాలలో గొడవపడ్డారు. ఈ విషయాన్ని చాపురంలో ఉంటున్న టీడీపీ నేతకు కుమారుడు చెప్పడంతో వారంతా వెళ్లి రాగోలులో నివాసముంటున్న టీడీపీ సభ్యురాలిపైన, ఆమె కుమారుడిపైన దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో బాధితులు శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇది జరిగి మూడు రోజులు కావస్తున్నా పోలీసులు మాత్రం కేసు నమోదు చేయడం లేదు. తీవ్రంగా గాయపడిన మహిళ మాత్రం దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ స్టేషన్‌లో తిష్టవేసింది. అయినప్పటికీ పోలీసులు రాజీచేసే దిశగా చేస్తున్నారే తప్ప కేసు నమోదు చేయడంలో వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ రాము వద్ద ప్రస్తావించగా ఇంకా కేసు నమోదు చేయలేదన్నారు.

క్లుప్తంగా

ఉత్తరాంధ్ర క్విజ్ పోటీల్లో విజేత గరివిడి



గరివిడి జట్టుకు బహుమతి అందజేస్తున్న మెగా యూత్ సభ్యులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామం రైల్వే గేటు సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రుల సందర్భంగా గ్రామానికి చెందిన మెగా యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తరాంధ్ర క్విజ్ పోటీలను నిర్వహించారు.ఈ పోటీల్లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 25 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ పోటీల్లో మొదటి స్థానంలో గరివిడి మండల జట్టు నిలిచింది. అలాగే ద్వితీయ స్థానంలో డెంకాడ, తృతీయ స్థానంలో నెల్లిమర్ల, నాలగవ స్థానంలో విజయనగరం జట్టు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ 8వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ 2వేలు నగదు బహుమతులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఆనకట్టకు జలకళ



నారాయణపురం ఆనకట్ట

సంతకవిటి: మండలంలోని రంగారాయపురం వద్ద నారాయణపురం ఆనకట్ట జలకళను సంతరించుకుంది. ఆనకట్ట వద్ద షట్టర్ల పైనుంచి వరద నీరు జలపాతంలా దిగువకు జాలువారుతోంది. దీంతో ఆనకట్ట వద్ద ఆహ్లాదకర వాతావరణం సంతరించుకుంది.

లారీ ఢీకొని హిజ్రా మృతి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం టోల్ ప్లాజా వద్ద లారీ ఢీకొని హిజ్రా మతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై ఆర్.జయంతి ఆదివారం తెలిపారు. బీసీ కాలనీలో ఉంటున్న తొటి హిజ్రాలను కలవడానికి వచ్చి తిరిగి ప్రయాణంలో వెళ్తుండగా సాలూరు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మతి చెందింది. ఎక్కడ నుంచి వచ్చారు? ఎందుకు వచ్చారు? పేరు? చిరునామా? తదితర వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై చెప్పారు.

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడి మృతి



గౌరు మృతదేహం

మక్కువ: మండల కేంద్రం మక్కువలో విద్యుదాఘాతంతో ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని చప్పబుచ్చంపేట పంచాయతీ ఎం.పాలిక వలస గ్రామానికి చెందిన పాల.గౌరు(39) తాపీమేస్త్రిగా జీవిస్తున్నాడు స్థానిక బీసీ కాలనీలో ఓ ఇంటి నిర్మాణ పనులను కాంట్రాక్టుకు తీసుకున్నాడు. ఆదివారం ఇంటి శ్లాబ్ పరిశీలించడానికి గౌరు వెళ్లాడు. మేడ మీదికి వెళ్లి పిట్టగోడ ఎక్కి, శ్లాబ్‌ను పరిశీలించి దిగుతున్న క్రమంలో ఇంటి పక్కన వేలాడుతున్న విద్యుత్ వైర్లను ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురై నేలపై పడిపోగా తలపై, నుదుటిపై గా యాలు తగిలి మృతిచెందాడు. మృతుని భార్య పైడితల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త సాలూరు సీహెచ్‌సీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సాలూరు: పట్టణంలోని బంగారమ్మ కాలనీలో గల గొడగొల వీధికి చెందిన జలుమూరు సాయి (28) ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ, మద్యానికి బానిసై అనారోగ్యం పాలై భార్యాపిల్లలకు దూరంగా ఉండడంతో మనస్తాపానికి గురయ్యాడన్నారు. ఈ క్రమంలో ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని సోదరుడు ఉమ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని అన్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారని చెప్పారు.

రేడియోగ్రాఫర్‌కు మందలింపు

విజయనగరం క్రైమ్: సర్వజన ఆసుపత్రిలో శనివారం జరిగిన ఘటనపై విజయనగరం వన్‌టౌన్ పోలీసులకు ఆదివారం వచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేయకుండా మందలించి పంపించేశారు. వివరాల్లోకి వెళ్తే..గజపతినగరానికి చెందిన ఒక మహిళకు ఫైల్స్ ఆపరేషన్ నిమిత్తం ఆస్పత్రి వైద్యుడు ఎక్స్‌రేకు రిఫర్ చేశారు. ఎక్స్‌రే కోసం రూమ్‌లోకి వెళ్లిన మహిళపై సదరు రేడియోగ్రాఫర్ అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయమై వన్‌టౌన్ ఎస్సై లక్ష్మీ ప్రసన్నకుమార్ రేడియోగ్రాఫర్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. ఫిర్యాదు దారురాలి భర్త అభ్యర్థన మేరకు రేడియోగ్రాఫర్‌ను తమదైన శైలిలో పోలీసులు కోటింగ్ ఇచ్చారు. రేడియోగ్రాఫర్ ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఉద్యోగ రీత్యా ఇబ్బంది కలుగుతుందని కేసు నమోదు చేయవద్దని బాధితులు చెప్పడంతో నమోదు చేయలేదని ఎస్సై లక్ష్మీ ప్రసన్నకుమార్ తెలిపారు.

విద్యార్థులతో చెలగాటం..!

- డిగ్రీ ప్రవేశాల్లో గందరగోళం
- ఇప్పటికే సీట్లు ఖరారై పలుమార్లు వాయిదా
- ఆంధ్రా విశ్వవిద్యాలయం పరిధిలో 30వేలమంది ఎదురు చూపు
- తరగతులు నిర్వహిస్తున్నా అడ్మిషన్లు కాకపోవడంతో ఆందోళన
- ఇంటర్ ఫలితాలు విడుదలైనా ప్రవేశాలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం



పార్వతీపురం ఎస్‌వీడీ డిగ్రీ కళాశాల

పార్వతీపురం రూరల్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు దాదాపు 10 ఉన్నాయి. ఇంటర్‌మీడియట్ ఫలితాలు విడుదలై నేటికి ఐదు నెలలు కావస్తున్నా డిగ్రీ చదువుకునే విద్యార్థులకు నేటికీ అడ్మిషన్లు కాక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డిగ్రీ ప్రవేశాలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని స్పష్టంగా అర్థమవుతోంది. ఈ ఏడాదిలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్రస్థాయిలో జాప్యం జరుగుతోంది. ఫలితంగా సెప్టెంబర్ 3వ వారం వచ్చినా అడ్మిషన్లు జరగక తరగతులు ప్రారంభం కాక విద్యార్థులు, కళాశాల యాజమాన్యాల్లో తీవ్ర స్థాయిలో ఆందోళన నెలకొంది. ఇతర రాష్ట్రాల్లో విడతల వారీగా చేపట్టిన ప్రవేశాలు ఇప్పటికే పూర్తయి తరగతులు నిర్వహిస్తున్నారు. ఇది కేవలం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్టగా విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు పేర్కొంటున్నారు. మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖలో ఇలా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం పట్ల విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే రెండు దఫాలుగా వాయిదా

దాదాపు 30వేలమంది విద్యార్థులు ప్రతి ఏడాది వివిధ కోర్సుల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న సుమారు 191 డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పొందుతారు. ఈ ఏడాది విద్యాసంవత్సరంలో కూటమి ప్రభుత్వం సంస్కరణల పేరట డబుల్ మేజర్ విధానం తెచ్చేందుకు మూడు నెలల క్రితం దానికి సంబంధించి షెడ్యూల్ ఇచ్చి కళాశాలల ద్వారా దరఖాస్తులు తీసుకుంది. అయితే ప్రక్రియ అంతా ముగిసిన వెంటనే మళ్లీ పాత విధానం అంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మళ్లీ కళాశాలల యాజమాన్యాలను కొత్తగా కోర్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక కళాశాలలకు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని హడావిడి చేశారు. ఈ పక్రియ కూడా పూర్తయ్యాక గత నెల 20న ఆన్‌లైన్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆగస్టులో 20 నుంచి 26వరకు ప్రవేశాల రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని ఆగస్టు 24 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్లకు గడువు ఇచ్చారు. ఈ మేరకు ఈనెల 1 నుంచి తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపంతో సకాలంలో తెరుచుకోకపోవడంతో ఈనెల 3వ తేదీవరకు ప్రవేశాలకు, 4వ తేదీవరకు ఆప్షన్లు పెట్టుకోవడానికి గడువు పొడిగించారు. ఈనెల 8వ తేదీన సీట్ల కేటాయింపు, కళాశాలల్లో విద్యార్థుల రిపోర్టింగ్‌కు గడువు ఇచ్చారు. ఈనెల 9న ప్రవేశాలు పొందిన విద్యార్థులకు తరగతుల నిర్వహణ ప్రారంభమవుతుందని మరోసారి తాజాగా ఇచ్చిన షెడ్యూల్‌లో ప్రభుత్వం పేర్కొంది. అయితే గడువు పూర్తయినప్పటికీ నేటివరకు విద్యార్థులకు సీట్ల కేటాయింపు పూర్తి కాలేదు. సోమవారం జరిగే అవకాశం ఉంటుందని వారికొచ్చిన సమాచారం మేరకు యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే మొదటి విడత సీట్ల కేటాయింపుపై ఇంతవరకు స్పష్టత లేక కాకపోవడంతో రెండు, మూడు విడతలకు సంబంధించి అలాగే స్పాట్, యాజమాన్య కోటా ప్రవేశాలు జరగడానికి మరికొంత జాప్యం జరిగే అవకాశం స్పష్టంగా కనబడుతోంది. ప్రభుత్వం చేసిన ఈ జాప్యం కారణంగా మొదటి ఏడాది సిలబస్, సబ్జెక్టు క్రెడిట్‌లో మార్పులు చేశారు. ప్రవేశాలు పూర్తయ్యి తరగతులు ప్రారంభమయ్యే సమయానికి మార్కెట్‌లో పుస్తకాలు దొరుకుతాయో లేదో అన్న ఆందోళన కూడా విద్యార్థులను పీడిస్తోంది. ఈ క్రమంలో డిగ్రీ ప్రవేశాల్లో భారీగా తగ్గుదల ఉంటుందని, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఆందోళన చెందుతున్నాయి.

సగం విద్యాసంవత్సరం గడిచింది



గతంలో ఎన్నడూ లేని విధంగా, ఎప్పుడూ జరగని విధంగా ఈ ఏడాది ప్రభుత్వ నిర్లక్ష్యంతో డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ తీవ్ర జాప్యం నెలకొంది. కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలే దీనికి కారణం. ఇప్పటికే సగం విద్యాసంవత్సరం కూడా గడిచిపోయింది. మిగిలిన తరగతుల విద్యార్థులంతా త్వరలో సెమిస్టర్ పరీక్షలు రాయనున్నారు. కానీ డిగ్రీ మొదటి సంవత్సరం సిలబస్ ఎప్పుడు పూర్తి చేస్తారో, పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటర్ ఫలితాలు విడుదలై ఐదునెలలు గడుస్తున్నా డిగ్రీ ప్రవేశాలు చేపట్టకపోవడం ముమ్మాటికీ కూటమి ప్రభుత్వం వైఫల్యమేనని స్పష్టంగా అర్థమవుతోంది. ప్రభుత్వం ఈ విధంగా డిగ్రీ విద్యార్థులతో ఆటలాడుకోవడం సరికాదు. ఇంకా ఆలస్యం చేస్తే భవిష్యత్‌లో విద్యార్థుల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయి.

బోను రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, అఖిల భారత విద్యార్థి సమాఖ్య

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలి

- సీఐటీయూ రాష్ట్ర నాయకులు
- ముగిసిన మహాసభలు



జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న ఆర్. నారాయణమూర్తి

పాలకొండ: ప్రజాసమస్యల పరిష్కారమే కార్మిక సంఘాల లక్ష్యం కావాలని విప్లవవాది, సినీనటుడు ఆర్ నారాయణ మూర్తి అన్నారు. రెండు రోజులుగా పాలకొండ పట్టణంలో నిర్వహిస్తున్న సీఐటీయూ 11వ జిల్లా మహసభలు ఆదివారం ముగిశాయి. ఈ సమావేశంలో నారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు ఉన్నది ప్రజలకు సేవ చేసేందుకు అని తెలిపారు. సమసమాజ స్థాపన కోసం కార్మిక నాయకులు పోరాటాలు చేయక తప్పదన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పోరాటాలపై నిర్బంధాలు విధిస్తున్నాయని మండిపడ్డారు. పోరాటాలతోనే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు. కార్మికులు, ఉద్యోగులు, చివరికి అధికారులపైన కూడా కూటమి ప్రభుత్వం రాజకీయ వేధింపులు చేపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్వతీపురం ఎమ్మెల్యే కార్మికులపై ఉక్కుపాదం మోపే చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. అవివేక ధోరణితో ప్రభుత్వం పాలన సాగిస్తోందని, పోలీసులను పావులుగా వాడుతోందని ఆరోపించారు. రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ మహాసభల్లో చూపించిన స్ఫూర్తితో పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం 47 మంది సభ్యులతో జిల్లా కమిటీని ఎంపిక చేశారు. ఈ సమావేశాల్లో పలు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు దావాల రమణారావు, మన్మథరావు, ఎం.కృష్ణమూర్తి, కె.రామస్వామి, తిరుపతిరావు పాల్గొన్నారు.

గురజాడ నివాసాన్ని స్మారక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- జనవిజ్ఞాన వేదిక డిమాండ్



మయూరి కూడలి నుంచి గురజాడ నివాసం వరకూ జేవీవీ ఆధ్వర్యంలో సైన్స్‌వాక్

విజయనగరం గంటస్తంభం: సాహిత్య కారుడు, మహాకవి గురజాడ అప్పారావు నివాసాన్ని స్మారక కేంద్రంగా తీర్చిదిద్దాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక మయూరి జంక్షన్ నుంచి గురజాడ అప్పారావు నివాసం వరకూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సమాజంలోని అసమానతలను బటయపెట్టారన్నారు. ప్రభుత్వం గురజాడ నివాసాన్ని స్వాధీనం చేసుకుని, స్మారక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దీనిపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలుగు ప్రజలు అందరూ గౌరవంతో దర్శించుకునే విధంగా గురజాడ గృహాన్ని పునఃనిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురజాడ అప్పారావు జయంతి, వర్ధంతిలను రాష్ట్ర పండగలుగా నిర్వహించాలని సూచించారు. ఆయన పేరు మీద సాంస్కృతిక విశ్వవిద్యాలయం స్థాపించాలని చెప్పారు. సైన్స్ వాక్‌లో పాల్గొన్న కళాకారులు గురజాడ గేయాలను ఆలపించి, గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు, మహాసభ ప్రతినిధులు, కవులు, విద్యావేత్తలు,మేధావులు, కళాకారులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో జొన్నగుడ్డిలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిపై ఎస్‌ఐ లక్ష్మీప్రసన్నకుమార్ కేసు నమోదు చేశారు. జొన్నగుడ్డిలోని రామాలయం పక్కన ఒక ఇంట్లో ఐదుగురు పేకాట ఆడుతుండడాన్ని గుర్తించి టౌన్ న్యూసెన్స్ యాక్ట్‌కింద జూదరులను అరెస్టు చేసి రూ.17వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగిన ఉపాధ్యాయుల నిరసన వారం

- మంత్రి కొండపల్లికి వినతి



కలెక్టరేట్ ప్రాంగణలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసనలో ఏపీటీఎఫ్ సభ్యులు

విజయనగరం అర్బన్: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్న నిరసన వారం కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగింది. ఈ మేరకు కలెక్టరేట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం ఎదుట ఉపాధ్యాయులు నిరసన నినాదాల కార్యక్రమం చేపట్టారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. నిరసన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఇంతవరకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు విడుదల చేయాలి. సీపీఎస్ రద్దు, ఐఆర్ (ఐఆర్) ప్రకటన, బకాయిల చెల్లింపు హెల్త్ కార్డు పరిమితి పెంపు, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానం రద్దు తదితర డిమాండ్‌లు పరిష్కరించాలని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ కర్రి రవి, జిల్లా అధ్యక్షుడు షేక్ బుకారీ బాబూ, ప్రధాన కార్యదర్శి పాల్తేరు శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ కర్రి రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు మజ్జి రమేష్, మార్రాపు శ్రీనివాస్, కె.వెంకునాయుడు, టి.శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, సుగుణాకరరావు, పి.సత్యన్నారాయణ కె.వెంకటరావు పాల్గొన్నారు.

ప్రకృతి అందాల కనువిందు



పచ్చని సౌందర్యంతో కనువిందు చేస్తున్న రామతీర్థం, సీతారామునిపేట పంటపొలాలు



ఎత్తైన బోడికొండతో అందంగా కనిపిస్తున్న సీతారామునిపేట చెరువు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం పరిసర ప్రాంతాలు సహజ సిద్ధ సౌందర్యానికి నిలయంగా మారుతున్నాయి. ఒక వైపు ఎత్తైన బోడికొండ. మరో వైపు నిండుకుండలా చెరువు ఎంతో అందంగా దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు రామతీర్థం, సీతారామునిపేట పరిసర ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో ఉన్న వరి పంట పొలాలు పచ్చని సౌందర్యంతో కనువిందు చేస్తున్నాయి. ఈ దృశ్యాలు కళ్లకు హాయినిస్తూ, మనసుకు ఆనందాన్ని పంచుతున్నాయని ప్రకృతి ప్రేమికులు మురిసిపోతున్నారు. ఆదివారం ఈ అందమైన దృశ్యాలను సాక్షి తన కెమెరాలో బంధించింది.

కొనసాగుతున్న రెస్క్యూ



నాగావళి నది గర్భంలో వెతుకుతున్న పోలీస్, అగ్నిమాపక సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురం సమీపంలో వంతెనపై నుంచి నాగావళి నదిలో శనివారం సాయంత్రం ఓ గుర్తు తెలియని మహిళ దూకిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అటు విజయగరం జిల్లా రేగిడి, ఇటు మన్యం జిల్లా పాలకొండ సివిల్ పోలీసులతో పాటు స్థానిక అగ్నిమాపక అధికారులు వెతుకులాట చేపట్టారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. అనుభవజ్ఞులైన ఈతగాళ్లతోపాటు డ్రోన్ సాయంలో కొంత మేరా శోధించారు. అయినప్పటికీ ఎటువంటి ఫలితం లేనట్లు స్థానిక ఎస్సై కె.ప్రయోగమూర్తి తెలిపారు. కేవలం వంతెనపై లభించిన పాదరక్షలు మినహా ఎటువంటి క్లూ గాని, మహిళను సజీవంగా, నిర్జీవంగా గుర్తించలేదన్నారు. తీరం వెంబడి గ్రామాలకు సమాచారం అందించామని, ఇరు జిల్లాల పరిధిలో ఎక్కడా మిస్సింగ్ కేసులు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

ముగ్గురికి గాయాలు

సంతకవిటి: మండల పరిధి జీఎంఆర్ ఐటీ సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు ఏఎస్సై ఎం.వాసుదేవరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రేగిడి ఆమదాలవలస మండలం ఆడవరం గ్రామానికి చెందిన బంకి సింహాచలం, భార్య రమణమ్మ, రేగిడి ఆమదాలవలస నుంచి మనుమరాలు రితికను తీసుకుని చీపురుపల్లి లోని తన కుమార్తె ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో రాజాం పాలకొండ ప్రధాన రహదారిలో జీఎంఆర్ ఐటీ సమీపంలో వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ వారి బైక్‌ను దాటుకుని ముందుకు వెళ్లి వీధిలోకి తిప్పే క్రమంలో మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి, ముగ్గురు ప్రస్తుతం రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బంకి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన తుది జట్లతో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, శిక్షకులు

పాలకొండ రూరల్: ఈనెల 24 నుంచి 28 వరకూ ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సంబంధించిన జిల్లా జట్టు ఎంపిక ఆదివారం పాలకొండలో జరిగింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో జరిగిన ఈ ఎంపిక పోటీలకు జిల్లా పరిధిలో 15 మండలాలకు చెందిన 20 ఏళ్ల లోపు ఔత్సాహికులు హాజరయ్యారు. జూనియర్ విభాగానికి చెందిన ఎంపికలో బాలురు 70 మంది, బాలికలు 50 మంది ప్రతిభ కనబర్చారు. తుది జట్టులో 14 మంది వంతున రెండు జట్లను బాల,బాలికల నుంచి ఎంపిక చేశారు. అత్యంత ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ సంఘం గౌరవ అధ్యక్షుడు పల్లా కొండలరావు, అధ్యక్షుడు కోడి సుదర్శనరావు, కార్యదర్శి వెన్నపు చంద్రరావు(శేఖర్) తదితరులు తెలిపారు.

క్రైస్తవ విశ్వాసులు లోకానికి వెలుగునివ్వాలి

- ప్రముఖ క్రైస్తవ ఆధ్యాత్మిక వేత్త బెన్నీ ప్రసాద్
- ముగిసిన సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150వసంతాల వేడుక



ఆధ్యాత్మిక దైవసందేశాన్ని అందజేస్తున్న బెంగళూరు బెన్నీప్రసాద్, తెలుగులో అనువాదం చేస్తున్న పాస్టర్ యబ్బోజు చౌదరి

విజయనగరం టౌన్: క్రైస్తవ విశ్వాసులు లోకానికి వెలుగై ఉన్నారని, అటువంటి క్రైస్తవులందరూ దీపంలా అనేకులకు వెలుగునివ్వాలని ప్రముఖ క్రైస్తవ ఆధ్యాత్మిక వేత్త బెన్నీ ప్రసాద్ (బెంగళూరు) పేర్కొన్నారు. సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150వసంతాల వేడుకల్లో చివరిరోజు ఆదివారం చర్చి ఆవరణలో నిర్వహించిన ఆధ్యాత్మిక సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో పాటూ జిల్లాలోని ఆధ్యాత్మిక క్రీస్తు సహోదరులకు ఆయన దైవసందేశాన్ని అందజేశారు. ఆయన ఆంగ్లభాషలో చెప్పిన దేవుని వాక్యాలను పాస్టర్ యబ్బోజు చౌదరి తెలుగులోకి అనువదించి భక్తులకు వివరించారు. విశ్వాసంతో, ఆసక్తితో ప్రార్థన చేస్తే దేవుని రక్షణ పొందగలమన్నారు. అద్భుతమైన గిటార్ వాయిద్య సహకారంతో దేవుని కీర్తనాలాపన చేస్తూ, ఆధ్యాత్మిక విషయాలను బోధించారు. సంఘమిత్ర ఆర్ఎస్.జాన్ మాట్లాడుతూ సిమ్స్ చర్చి 150వసంతాల వేడుకలను పెద్దలందరి సహాయ, సహకారాలతో అంగరంగ వైభవంగా నిర్వహించుకోగలిగామన్నారు. ఐదురోజుల పాటు నిర్వహించిన క్రైస్తవ మహాసభలకు హాజరై ఆధ్యాత్మిక దైవసందేశాన్నిచ్చిన పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిమ్స్ జూబ్లీ కమిటీ చైర్మన్ ఎం.ఎ.నాయుడు, కార్యదర్శి తాలాడ ఆనందరావు, వై.ప్రభాకర్, ఆశాజాన్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఇంట్లో దోపిడీ

- హడలిపోయిన కుటుంబ సభ్యులు



బాధిత కుటుంబసభ్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ అప్పలనాయుడు

కొత్తవలస: మండలంలోని చింతలపాలెం సమీపంలో గల శీరంశెట్టివానిపాలెం గ్రామంలో ఒక ఇంటిలో అర్ధరాత్రి ఇంటి తలుపులు కొట్టి తీయగానే ఇంటిలోకి ప్రవేశించి కుటుంబసభ్యులను బంధించి బంగారం, నగదును దుండగులు దోచుకుపోయారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మీసాల రవిప్రకాష్ గ్రామానికి కొంతదూరంలో ఇల్లు కట్టుకుని కుటుంబంతో నివసిస్తున్నాడు. శనివారం రాత్రి రవిప్రకాష్ కేటరింగ్ పని నిమిత్తం గాజువాక వెళ్లాడు. ఇంట్లో భార్య సత్యవతి, మామ, అత్త, ఇద్దరు పిల్లలు తలుపులు గడియలు పెట్టి నిద్రపోయారు. ఈ క్రమంలో రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఒక వ్యక్తి వచ్చి తలుపు తట్టడంతో రవిప్రకాష్ మామ తలుపు తెరిచాడు. సదరు దుండగుడు ఒక్క సారిగా ఆయనపై విరుచుకుపడి స్క్రూడ్రైవర్‌తో చెవిభాగంలో పొడిచి లోనికి ప్రవేశించాడు.ఇంతలో మరో ఐదుగురు వ్యక్తులు ముఖాలకు ముసుగులు తొడుక్కుని ఇంటిలోకి ప్రవేశించారు. అత్త, మామను ఒక గదిలోను, భార్య సత్యవతి, ఇద్దరు పిల్లలను మరో గదిలో బంధించి బంగారం, డబ్బు ఎక్కడ ఉందో చెప్పాలని భయభ్రాంతులకు గురిచేశారు. గొడవ చేసి అరిస్తే చంపేస్తాం అంటూ హిందీ, తెలుగు బాషల్లో భయపెట్టారు.

పరిశీలించిన పోలీసులు

బలవంతంగా బీరువా తెరిచి అందులో గల బంగారం తాడు, ఉంగరం, శతమానాలు తదితర వస్తువులు రెండున్నర తులాల బంగారం, కొంత వెండి, రూ 24వేల నగదు దోచుకున్నారు.రవిప్రకాష్ అత్త చేతులకు ఉన్న గాజులు, చెవిదిద్దులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవి ఇత్తడి వస్తువులు అని చెప్పినా వినకుండా వాటిని సైతం లాక్కుని పోయారు. మొత్తం ఆరుగురు దుండగులు చేతికి అందింది దోచుకుని బయటకు వెళ్లి తలుపు గడియ పెట్టి వెళ్లిపోయారు. దీంతో రవిప్రకాష్ అత్తయ్య వద్ద గల ఫోన్‌లో గాజువాకలో గల రవిప్రకాష్‌కు జరిగిన విషయం తెలియపరచగా ఆయన పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి, చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేశాడు. అందరూ వచ్చి తలుపులు తీయగా కుటుంబసభ్యులు బయటకు వచ్చారు. బాధితుడు రవిప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు, స్థానిక ఎస్సై ఎస్.జోగారావుతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. విజయనగరం నుంచి ప్రత్యేక క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జోగారావు తెలిపారు.